క్లుప్తంగా

మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి



జైల్లో యోగా చేస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా చేయాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా సూచించారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లి వద్ద ఉన్న అనంతపురం జిల్లా జైల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఆర్ అడిషనల్ ఎస్పీతోపాటు డీఎంహెచ్ఓ డాక్టర్ దేవి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లా జైల్లో ఖైదీలు మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం, యోగా చేయాలన్నారు. తద్వారా మంచి ఆరోగ్యంతో పాటు ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో జైలర్లు నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, చీఫ్ హెడ్ వార్డెన్ దివాకర్, ఆయుష్ అధికారులు డాక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ లాల్యా నాయక్, యోగా గురువులు క్రిష్ణవేణి, గురు రాజా, త్యాగరాజ్ డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి



మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి 28వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు హాజరై మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పని చేశారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ కోనారెడ్డి, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఏకే నరసింహులు, పుల్లారెడ్డి, గట్టు రామక్రిష్ణ రెడ్డి, గంగాధర, జంగప్ప, మునిరెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో లాభసాటి వ్యవసాయం



మాట్లాడుతున్న రేకులకుంట సైంటిస్ట్ లక్ష్మణ్

పామిడి: సాంకేతిక పద్ధతుల విధానం వల్ల లాభసాటి వ్యవసాయం సాధ్యమని కేవీకే, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. ఆదివారం మండలంలోని కండ్లపల్లి, ఎద్దులపల్లి గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంపై ఏఓ డీ లీనా వసుంధర ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలిచ్చారు. ఏక పంట సాగు మాని, అంతరపంటలు, మిశ్రమ పంటలు, పంట మార్పిడి విధానం ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. మట్టి నమూనాల సేకరణ, వాటి పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు ఎరువుల వాడకం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ అధికారులు, మహిళా సంఘాలు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన రిజిస్ట్రేషన్

శింగనమల: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి వేరుశనగ విత్తన రిజిస్ట్రేషన్ నమోదు చేస్తామని ఏఓ అన్వేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. విత్తన కాయలు కావల్సిన రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబరు తీసుకు రావాలన్నారు.

డీవైఎఫ్ఐ కమిటీ ఎంపిక



నూతన కమిటీ సభ్యులు..

గుత్తి: పట్టణంలోని జెడ్ వీరారెడ్డి భవన్‌లో ఆదివారం గుత్తి పట్టణ డీవైఎఫ్ఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ సమక్షంలో కమిటీ అధ్యక్షుడిగా ఆలూరు శ్రీకాంత్, కార్యదర్శిగా అశోక్ కుమార్ మరో 16 మంది సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కారం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. జూన్ 1 నుంచి పాత పద్ధతి అంటే చౌకధాన్యపు దుకాణాల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలని ప్రకటించింది. దీంతో ఆదివారం రేషన్ కార్డుదారులు ప్రభుత్వ చౌక దుకాణాల వద్ద సరుకుల కోసం పడిగాపులు కాశారు. రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరాల్సి వచ్చింది. సరుకుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు చేర్చారు. అయితే కూటమి వచ్చాక మళ్లీ పాత పద్ధతినే అమలు చేసింది. దీంతో జనాలు వైఎస్ జగన్ పాలనలోనే బాగుండేదని చర్చించుకోవడం కనిపించింది.



పామిడిలో రేషన్ షాపు వద్ద కార్డుదారుల పడిగాపులు



గుత్తిలో చౌక దుకాణం-3 వద్ద క్యూలో నిలుచున్న ప్రజలు

పడిగాపులు మళ్లీ మొదలు!

- రేషన్ దాకాణాల వద్ద లబ్ధిదారుల క్యూ
- కూటమి ప్రభుత్వంపై పేదల మండిపాటు

గుంతకల్లు/తాడిపత్రి రూరల్/గుత్తి/పామిడి: కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రేషన్ కోసం ప్రజలకు పరేషన్ మొదలైంది. ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదికే రేషన్ కోసం ప్రజలు పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తాడిపత్రి పట్టణంలోని చేనేతకాలనీలో ఆదివారం ఉదయం ఏడు గంటలకే రేషన్ దుకాణం వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు క్యూ లో ఉన్నారు. కొందరు సంచులను వరుసలో పెట్టి పక్కన కూర్చోవడం కనిపించింది. రేషన్ కోసం మహిళలు అధికంగా క్యూలో ఉన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని రేషన్ షాపుల వద్ద సరుకుల కోసం లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే వచ్చి ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు అందించేవారని లబ్ధిదారులు గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా పామిడిలో సాంకేతిక లోపంతో సర్వర్ పనిచేయక ప్రజలు పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. డీలర్లు సర్వర్ పనిచేయడం లేదని చెప్పడంతో చేసేదేమి లేక కార్డుదారులు నిట్టూరుస్తూ వెనుదిరిగారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ బాగుండేది..



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటివద్దకే వచ్చి రేషన్ పంపిణీ చేపట్టేవారు. ముసలి, ముతక, దివ్యాంగులకు ఈ విధానం బాగుండేది. ఇప్పుడు ఉన్నట్లుండి ఎండీయూ వాహన విధానాన్ని రద్దు చేయడంతో ఎఫ్‌పీ షాపు వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. మొదటిరోజు రేషన్ షాపుల వద్ద సాంకేతి సమస్య తీవ్రతరంగా ఉత్పన్నమవ్వడంతో రేషన్ ఇక్కట్లు మొదటికొచ్చాయి.

–పీ వరప్రసాద్, పామిడి

'కోటంక'లో ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దుకాణాల ఎదుట మురుగు..



మురుగునీరు తొలగిస్తున్న దుకాణదారుడు

తాడిపత్రిరూరల్: పట్టణంలోని బృందావన్ హోటల్ వద్ద రోడ్డు పక్కన డ్రైనేజీ స్తంభించడంతో మురుగు పైకి వచ్చింది. ఈ మురుగు నీటితో పక్కన ఉన్న దుకాణాదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాహనదారులు సైతం అవస్థలు పడుతున్నారు. దుకాణాల ఎదుట మురుగునీరు ఉండడంతో కొనుగోలు చేసేవారు ముక్కులు మూసుకుంటున్నారు. దుర్వాసన భరించలేక పలువురు దుకాణాల్లోకి రావడం లేదు. మురికినీటిని తొలగించేందుకు దుకాణదారులు ప్రయత్నాలు చేశారు. అధికారుల స్పందించి సమస్య పరిష్కరించాలని దుకాణదారులు కోరారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం



శింగనమలలో పోస్టర్లు విడుదల చేస్తున్న సమన్వయకర్త సాకే శైలజానాథ్

శింగనమల/గార్లదిన్నె: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 4న వెన్నుపోటు దినోత్సవం నియోజకవర్గ స్థాయిలో నార్పలలో నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ సూచించారు. ఆదివారం శింగనమలలోని రామాలయంలో మండల కన్వీనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్లను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను బెదిరిస్తున్నారని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, నాయకులు తరిమెల భాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎస్వీ నారాయణ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, సర్పంచ్‌లు రమేష్, ఎస్.పి.నారాయణరెడ్డి, నాగన్న, నవీన్, నలపరెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రసాద్, బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, నారాయణస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజు, అబ్దుల్, గురుమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- గార్లదిన్నె సమీపంలోని టీ కన్వెన్షన్ హాల్‌లో వెన్ను పోటు దినంకు సంబంధించిన పోస్టర్లను సమన్వయకర్త శైలజానాథ్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా రెడ్‌బుక్ ఓపెన్ పాలన సాగిస్తోందన్నారు. చేతనైతే కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్ పరిపాలనతో పోటీ పడాలన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 90 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. తెనాలిలో దళిత, మైనార్టీ యువకులను పోలీసులు నడిరోడ్డుపై చిత్రహింసలు పెట్టడం దారుణ మన్నారు. మహానాడులో సూపర్ సిక్స్ పథకాలు పక్కన పెట్టి ఆరు శాసనాలు చేస్తామని చెప్పడం హాస్యదస్పదంగా ఉందన్నారు. అనంతరం ఈనెల 4న నార్పలలో చేపట్టే వెన్ను పోటు దినంకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటనారాయణ జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధకర్‌రెడ్డి, నాయకులు బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రామచంద్రా రెడ్డి, ఎల్లారెడ్డి, బచ్చలన్న, అనిల్‌కుమార్ రెడ్డి, ఆదెప్ప, ప్రసాద్, చీమల రామక్రిష్ణ, చీమల శీన, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



గార్లదిన్నెలో పోస్టర్లు విడుదల చేస్తున్న సమన్వయకర్త శైలజానాథ్

నేడు వెన్నుపోటు దినం పోస్టర్ల విడుదల

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో సోమవారం వెన్ను పోటు దినం పోస్టర్లు విడుదల చేయనున్నట్లు జెడ్పీటీసీ భాస్కర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ ఈప జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్, అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఈ నెల 4న నార్పలలో నియోజకవర్గ స్థాయి వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తామనన్నరు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

వెన్నుపోటుకు ఆద్యుడు చంద్రబాబు



తిమ్మంపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



గుంతకల్లులో పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

- కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైవీఆర్ ధ్వజం
- వెన్నుపోటు దినం పోస్టర్ల విడుదల

తాడిపత్రిటౌన్: రాజకీయాల్లో వెన్నుపోటుకు ఆద్యుడుగా చంద్రబాబు పేరుగాంచారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. ఆదివారం యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామంలోని స్వగృహంలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆయన విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. రాష్ట్రంలో శాంతి బద్రతలు పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయం చంద్రబాబు గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలు త్వరలోనే ఆయనకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ నెల 4న తాడిపత్రిలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి తాడిపత్రి నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నమ్మి ఓటేసిన ప్రజలనూ వెన్నుపోటు పొడిచారు..

గుంతకల్లుటౌన్: అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 4న నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని ఆయన ఆరోపించారు. సూపర్‌సిక్స్ పేరిట అలవికాని హామీలిచ్చి కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజల్ని నిట్టనిలువునా మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని ఆయన మండిపడ్డారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజాద్రోహిగా మిగిలిన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్‌గా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనాల్లో తిరుగుతుంటే ప్రభంజనం మొదలైందని పసిగట్టిన బాబు అండ్ బ్యాచ్ ఎలాగైనా జగనన్నపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయాలనే కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. కూటమి నేతలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే వరకు వైఎస్సార్‌సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. జగనన్న పిలుపు మేరకు జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమంలో భాగంగా గుంతకల్లులోని పార్టీ కార్యాలయం నుండి మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు, కసాపురం రోడ్‌ల మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. బైక్‌ర్యాలీ, నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల నుంచి పార్టీశ్రేణులు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని వైవీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఎండీ.ఖలీల్, పి.రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు, మాజీ వీరశైవ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, పార్టీ అనుబంధ నియోజకవర్గం అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ జయప్రదం చేయండి

పామిడి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతిరెడ్డి సారధ్యంలో ఈనెల 4న నిర్వహించే వెన్ను పోటు దినం కార్యక్రమం జయప్రదం చేయాలని పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవ రెడ్డి, పట్టణ, రూరల్, వైస్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, ఆర్ వెంకటేష్‌నాయక్, సీలూరి హరినాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్డీఓ ఆఫీసు వరకూ బైకు ర్యాలీ ఉంటుందన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కదిలిరావాలని వారు కోరారు.

కరువు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: వలసలు, రైతు ఆత్మహత్యలు ఆగిపోవాలంటే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కింద ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి (ఓపీడీఆర్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వలసలలో ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందని, ఈ ఏడాది 4 లక్షల మంది కూలీలు ఉపాధి లేక వేరే రాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు. వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం చేయూతనందించని కారణంగా అప్పుల బాధతాళలేక కూటమి ఏడాది పాలనలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 70 మంది అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు వెంటనే నిలుపుదల చేయాలని, జీఓ 404,405ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకూ హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు వెడల్పు చేయాలన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నిర్దేశించిన విధంగా సీమలో పిల్లకాల్వల ద్వారా 6 లక్షల ఎకరాలకు, ఉమ్మడి అనంత జిల్లాలో 3.45 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ నాగరాజు, న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కడవకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం




పామిడిలోని టీసీ హైస్కూల్‌లో కలసిన పూర్వ విద్యార్థులు

పుట్లూరు: మండలంలోని కడవకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-2005 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కలుసుకునానరు. ఈ సందర్భంగా అప్పటి గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు సైతం ఈ కార్యక్రమం ద్వారా మిత్రులను కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏంఈఓ నాగరాజుతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో ఆదివారం 2006-07 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు లిడియా, రాధాశ్రీదేవి, ఏకనాథం, రామాంజనేయులును ఘనంగా సత్కరించారు. విద్యార్థులు క్లాస్ రూమ్‌లో చిలిపిచేష్టలను గుర్తుచేసుకుంటూ సరదాగా గడిపారు.

ఆలూరు కోనలో భక్తుల సందడి



ఆలూరు కోనలోని జలపాతంలో పిల్లలు, మహిళల కేరింతలు

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరు కోన జలపాతంలో పిల్లలు, మహిళలు కేరింతలు కొట్టారు. ఆదివారం కావడంతో తాడిపత్రి పట్టణానికి చెందిన చాలా మంది భక్తులు, పర్యాటకులు ఆలూరు కోనకు చేరుకుని సేద తీరారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం కోన జలపాతంలో కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. పెద్దత్తున ప్రజలు రావడంతో ఆలూరు కోన సందడిగా మారింది.

కలెక్టర్ వస్తున్నారని.. రోడ్డు మరమ్మతులు!

గుత్తి: యోగాంధ్ర కార్యక్రమానికి గుత్తికి సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ రానున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. అదీ తూతూ మంత్రంగా చేశారు. వివరాల్లోకి వెళితే.. గుత్తిలోని గాంధీ సర్కిల్ వద్ద నుంచి కోట వరకూ సుమారు కిలో మీటరు మేర రోడ్డు చాలా అధ్వానంగా తయ్యారైంది. పట్టణ ప్రజలు పలుమార్లు మున్సిపల్ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. ఈ క్రమంలో సోమవారం గుత్తికి జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ రానుండటంతో ఆఘ మేఘాల మీద రోడ్డు ప్యాచ్ వర్క్ (మరమ్మతు) పనులు చేపట్టారు. అదీ తూతూ మంత్రంగా రోడ్డు మధ్యలో మాత్రమే మరమ్మతులు చేయించారు. దీంతో దుకాణదారులు, ప్రజలు ఇదేంటని ప్రశ్నించారు. కేవలం లక్ష రూపాయలతో కిలో మీటరు మేర మాత్రమే పనులు చేయించారు. మున్సిపల్ అధికారులా.. మజాకా మరీ.



అరకొరగా రోడ్డు ప్యాచ్ వర్కులు చేసిన దృశ్యం



తూతూమంత్రంగా చేస్తున్న రోడ్డు మరమ్మతులు

నేడు గుత్తికి కలెక్టర్ రాక

గుత్తి: గుత్తిలోని కోటలో సోమవారం జరుగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హాజరుకానున్నారని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6.30 గంటలకు కలెక్టర్ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం వసుధ ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.